

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 287 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 01-05-2025 | పేజీలు : 5


# 25 లక్షల పరిహారం

- కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం
- క్షతగాత్రులకు రూ.3 లక్షల సాయం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి, విశాఖ, ఏప్రిల్ 30 (జనస్వరం) :** సింహాచలం క్షేత్రంలో గోడ కూలి భక్తులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా అధికారులు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయస్వామి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, విశాఖ ఎంపీ భరత్, సింహాచల దేవాలయ ధర్మకర్త అశోక్ గజపతిరాజుతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఘటన జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని సీఎం నియమించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం, క్షతగాత్రులకు రూ.3 లక్షల సాయం అందించనున్నట్లు ప్రకటించారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి దేవదాయశాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని, గోడ కూలిన ప్రదేశంలో శిథిలాలను వెంటనే తొలగించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పాల్సిందిగా మంత్రులను ఆదేశించారు. విచారణ కమిటీకి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేశ్‌కుమార్‌ను చైర్మన్‌గా, ఐపీఎస్ అధికారి ఆకే రవికృష్ణ, ఇరిగేషన్ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావును సభ్యులుగా నియమించారు. ఈ మేరకు సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీచేశారు. కమిటీ 72 గంటల్లోగా ప్రాథమిక నివేదిక ఇవ్వాలని, 30 రోజుల్లోగా పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించారు.



అర్ధరాత్రి ఏమి జరిగిందంటే.. | సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తులు మృతిచెందిన ఘటనపై విశాఖ

జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపింది. స్వామిని దర్శించుకునేందుకు రూ.300 టికెట్ క్యూలైన్‌లో నిల్చొన్న భక్తులపై కొత్తగా నిర్మించిన గోడ కూలడంతో ఏడుగురు మృతిచెందగా, మరో భక్తుడు తీవ్రంగా గాయపడినట్టు పేర్కొంది. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్ కుమార్ కాలు ఫ్రాక్చర్ కావడంతో విమ్స్‌లో చికిత్స పొందుతున్నారని వివరించింది.

**రాష్ట్రపతి, ప్రధాని విచారం :**

చందనోత్సవంలో గోడ కూలిన ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఇది బాధాకరమని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. దైవ దర్శనం కోసం వేచి ఉన్న భక్తుల్లో మహిళలు సహా అనేక మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "నా ఆలోచనలు, ప్రార్థనలు దుఃఖిస్తున్న కుటుంబాలతో ఉన్నాయి. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్ గ్రేషియా అందిస్తాం" అని మోదీ వెల్లడించారు.

**పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి :**

సింహచలంలో గోడకూలిన ఘటనలో ఏడుగురు భక్తులు మరణించడం దురదృష్టకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతి చెందిన వారిలో ఇద్దరు జనసైనికులు ఉన్నారని తెలిసి చింతించినట్టు తెలిపారు.

**ఆసాంతం బాధితుల వెంట అనిత**
**హెూంమంత్రి తీరుకు పవన్ అభినందన**

ప్రమాద ఘటన గురించి తెలిసినప్పటినుంచీ, బాధిత కుటుంబాలు మృత దేహాలతో కేజీహెచ్ నుంచి ఇళ్లకు చేరుకునేవరకు హెూం మంత్రి అనిత్ వారి వెంటే నిలిచారు. బాధిత కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతూ ఆస్పత్రిలో ఆసాంతం వారితోనే గడిపారు. సంఘటన జరిగిన వెంటనే హెూం మంత్రి అనిత స్పందించిన తీరును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో అభినందించారు. బాధిత కుటుంబ సభ్యులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మధ్యాహ్నం కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చి బాధితుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## శ్రీశైలం డ్యామ్‌కు తక్షణమే మరమ్మతులు చేయాలి

**నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్‌జైన్**



**శ్రీశైలం ఏప్రిల్ 30 (జనస్వరం) :** శ్రీశైలం డ్యామ్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టకపోతే రాష్ట్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ అనిల్‌జైన్ చెప్పారు. శ్రీశైలం డ్యామ్ పటిష్టతను అంచనా వేసేందుకు మంగళవారం అనిల్‌జైన్‌తోపాటు నిపుణులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అప్రోచ్ రోడ్, ప్లంజ్‌పూల్, గ్యాలరీ, బ్లాకులు, రేడియల్ క్రస్ట్ గేట్లను నిపుణులు పరిశీలించి వివిధ సమస్యలను గుర్తించారు. 2009వ సంవత్సరానికి ముందు ప్లంజ్‌పూల్ ప్రాంతంలో గోతులు ఏర్పడ్డాయి. అయితే, 2009 వరదల వల్ల ఒక్క రోజులోనే 25 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో ప్లంజ్‌పూల్ ప్రాంతంలో 120 మీటర్ల నుంచి 150 మీటర్ల లోతు గొయ్యిలు ఏర్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. దీనివల్ల డ్యామ్ పునాదులు కూడా బలహీనపడినట్లు తేల్చారు. స్పిల్‌వే ఎగువన కటాఫ్ దెబ్బ తినడంతో 17, 18 బ్లాక్‌లలో పగుళ్లు ఏర్పడ్డాయని, పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. సీజన్‌తో సంబంధం లేకుండా గ్యాలరీలో సీపేజీలు అధికమయ్యాయని, ఇవి డ్యామ్ అంతర్గత నిర్మాణాన్ని శిథిలం చేసేలా ఉన్నాయని పేర్కొన్నారు. శ్రీశైలం డ్యామ్ పటిష్టతకు తక్షణమే చర్యలు తీసుకోకపోతే జలాశయం మనుగడ మరింత ప్రమాదకరంగా మారుతుందని స్పష్టం చేశారు. అనంతరం డ్యామ్ ఇంజనీర్లతో అనిల్‌జైన్, నిపుణులు సమావేశమై మొదటి విడతలో అప్రోచ్ రోడ్ నిర్మాణం, ప్లంజ్‌పూల్ గోతుల పూడ్చివేత, రెండో విడతలో బ్లాకుల పటిష్టత, గ్యాలరీ సీపేజీల అరెస్టుకు చేపట్టాల్సిన మరమ్మతులపై చర్చించారు. పరిశీలనలు, సమీక్షలతోనే సంవత్సరాలుగా కాలయాపన చేయడం, శ్రీశైలం డ్యామ్ మరమ్మతులకు ప్రపంచ బ్యాంక్ రూ.200కోట్లు రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చినా వినియోగించుకోకపోవడంపై నిపుణులు విస్మయం వ్యక్తంచేశారు. ఎన్‌డీఎస్‌ఏ రీజనల్ డైరెక్టర్ ఎన్‌డీ గిరిధర్, డ్రిప్ ప్రాజెక్ట్ ప్రతినిధి నీతా, సెంట్రల్ వాటర్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ ప్రభాత్‌కుమార్, సీఈ రాజేష్ కశ్యప్, ఈఎన్‌సీ రత్నకుమార్, డ్యామ్ సీఈ కబీర్‌బాషా, ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి డ్యామ్ తనిఖీల్లో పాల్గొన్నారు.

## అపురూపం అప్పన్న నిజరూపం


- చందనోత్సవ వేళ కిక్కిరిసిన సింహగిరి
- పోటెత్తిన 1.2 లక్షల మంది భక్తులు

**సింహాచలం, ఏప్రిల్ 30 (జనస్వరం) :** ప్రసిద్ధి చెందిన సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం అర్ధరాత్రికే క్యూలైన్లు కిక్కిరిశాయి. ఈదురుగాలులు, వర్షాన్ని లెక్క చేయకుండా పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో సింహగిరి జనసంద్రమైంది. చందనోత్సవంలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి 12.45 గంటలకు సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం రుత్విగ్వరణం, పంచకలశావాహనం చేశారు. స్వామివారికి మంత్ర పూర్వకంగా కళా విసర్జనం జరిపారు. తర్వాత.. అర్చకులు వెండి బొరిగెలతో ఏడాదిపాటు స్వామివారి పైపూతగా ఉంచిన చందనోత్తరణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రభాత ఆరాధనలు చేసి, షోడశోపచారాలు, మంగళనీరాజనాలు ఇచ్చారు. ఒలుపు చందనాన్ని ఆలయ భాండాగారంలో భద్రపరిచారు. ఆచారం ప్రకారం దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, పూసపాటి కుటుంబీకులకు తొలిదర్శనం కల్పించారు. అంతరాలయంలో వారి గోత్రనామాలతో పూజలు చేసి, చందన కిరీటాన్ని శిరస్సున ఉంచారు. శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం వేదపండితులు చతుర్వేద స్వస్తివచనాలతో ఆశీర్వదించగా, ఈవో కొమ్ముల సుబ్బారావు శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



తెల్లవారుజామున 2.19 గంటలకే పూసపాటి వంశీయుల దర్శనం పూర్తి కావడంతో 2.45 గంటల నుంచి భక్తులకు నిజరూప దర్శన భాగ్యం కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ తరఫున చైర్మన్ బీఆర్ నాయుడు అశోక్‌గజపతిరాజు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. రాత్రి 9.30 గంటలకు ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్‌స్వామి సారథ్యంలో శ్రీవైష్ణవస్వాములు గంగధార నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలతో సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున, తిరిగి మధ్యాహ్నం సింహగిరిపై భారీ వర్షం కురిసినప్పటికీ సుమారు 1.2 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ :** 01 మే 2025,
**తిథి :** శుద్ధ చవితి (ఉ.11:26వ.కు),
**నక్షత్రం :** మృగశిర (మ.02:22వ.కు)
**బ్రహ్మ ముహూర్తం :** తె.04:19ల తె.04:58
**రాహుకాలం :** మ.01:40ల మ.03:14,
**యమగండం :** ఉ.05:46ల మ.03:14,
**వర్జ్యకాలం :** రా.10:15ల రా.11:56,

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ :** 01 మే 2025,
**ఫజర్ :** తెల్లవారుజామున గం. 04:42
**సూర్యోదయం :** ఉదయం గం. 05:56
**జొహర్ :** మధ్యాహ్నం గం. 12:17
**అసర్ :** సాయంత్రం గం. 03:25
**మఘ్రిబ్ :** సాయంత్రం గం. 06:37
**ఇష :** రాత్రి గం. 07:52





జన స్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# అమరావతి పర్యటన వేళ మోదీ ఊహించని వరం..!?

అమరావతి కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాని మోదీ ఏపీ పర్యటన వేళ భారీ అంచనాలు ఉన్నాయి. కేంద్రం - ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు తరువాత రాజధాని కోసం పలు నిర్ణయాలు జరిగాయి. కేంద్రం ప్రపంచ బ్యాంకు రుణంతో పాటుగా ఇతర ప్రాజెక్టులను కేటాయించింది. ఇప్పుడు పనుల రీ లాంఛ్ కోసం ప్రధాని అమరావతికి వస్తున్నారు. కాగా, ఈ వేళ ఏపీ ప్రభుత్వం నుంచి ప్రధానికి పలు వినతులు అందుతున్నాయి. ప్రధాని అమరావతి వేదికగా కీలక ప్రకటన ఉంటుందనే అంచనాలు వ్యక్తం అవుతున్నాయి.

**అమరావతి కేంద్రంగా :**

పహల్గాం ఉగ్రదాడి తరువాత ఢిల్లీ కేంద్రంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఉత్కంఠగా మారుతున్నాయి. ప్రధాని మోదీ కేంద్ర మంత్రులు.. సైనిక అధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏ క్షణమైనా ఏ నిర్ణయం అయినా తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇటు ఇదే సమయంలో ఏపీలో ప్రధాని పర్యటన ఖాయమైంది. మే 2న ప్రధాని మోదీ అమరావతి షెడ్యూల్ ఖరారు చేసారు. ప్రధాని పర్యటన కోసం ఏపీ ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. స్వాగత ఏర్పాట్ల నుంచి బహిరంగ సభ కోసం ప్రత్యేకంగా నిర్ణయాలు తీసుకుంటోంది. లక్షలాది మందితో సభ ఏర్పాటుకు కసరత్తు కొనసాగుతోంది. ఇదే సమయంలో ప్రధాని అమరావతి కేంద్రంగా చేసే ప్రసంగం పైన ఆసక్తి నెలకొంది.

**ప్రధానిపై ఆశలు :**

2015లో అమరావతి రాజధానిగా ప్రకటించిన సమయంలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసారు. ఆ తరువాత వరుసగా చోటు చేసుకున్న పరిణామాలతో అమరావతి అంశం వివాదంగా మారింది. ఇప్పుడు తిరిగి ఏపీలో అమరావతి పనులు ప్రారంభోత్సవం కోసం చంద్రబాబు ఆహ్వానం మేరకు





ప్రధాని అమరావతి వస్తున్నారు. నాడు అమరావతి శంకుస్థాపనకు వచ్చిన సమయంలో ప్రధాని పార్లమెంట్ మట్టి.. పుణ్య నదుల నీరు తెచ్చారు. రాజకీయంగానూ ఆ తరువాత వీటి పైన భిన్నాభి ప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

కాగా, ఇప్పుడు అమరావతి కోసం కేంద్రం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోంది. ప్రపంచ బ్యాంకు రుణంతో పాటుగా అమరావతికి రైల్వే ప్రాజెక్టు, రింగ్ రోడ్ నిర్మాణం వంటి వాటికి ఆమోదం తెలిపింది. ఇదే సమయంలో

## ఎడిటోరియల్

అమరావతికి చట్ట బద్దత అంశం ఇప్పుడు రైతుల్లో.. ప్రభుత్వంలో చర్చ సాగుతోంది.

**ప్రధాని ప్రకటనపై :**

ఇక, ఏపీకి చెందిన కొంతమంది బీజేపీ నాయకులు అమరావతికి రెండో సారి మోడీని పిలవటం సరికాదనే అభిప్రాయంతో ఉన్నారు. అయితే.. ముఖ్యమంత్రి అభ్యర్ధన మేరకు ప్రధాని మోదీ అమరావతికి వస్తున్నారు. ప్రధాని రాక వేళ పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవం చేసేలా కార్యాచరణ సిద్దం చేస్తున్నారు. ఏపీకి అమరావతి రాజధానిగా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా మార టంతో.. ఇప్పుడు ప్రధాని మోదీని బహిరంగ సభ వేదికపైన నుంచి చంద్రబాబు మరి కొన్ని అంశాల పైన మద్దతు కోరేందుకు సిద్దం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ప్రధాని మోదీ సైతం అమరావతి కోసం భారీ వరం ప్రకటించే అవకాశం ఉందనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో సాగుతోంది. మరి.. మోదీ అమరావతి కేంద్రంగా ఏదైనా ప్రకటన చేస్తారా.. ఏం చేయబోతున్నారనే ఆసక్తి నెలకొంది.



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

## ఉరి వేసుకుని యువకుడి మృతి



**పులివెందుల, ఏప్రిల్ 30 (జనస్వరం) :** నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం కోవరంగుం టపల్లెకు చెందిన ఆశీర్వాదం బుధవారం ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడి సోదరుడు కథనం ప్రకారం.. మృతుడు ఆశీర్వాదం గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ ఉండేవాడని, మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన



**పులివెందుల, ఏప్రిల్ 30 (జనస్వరం) :** పట్టణంలోని మెప్మా కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. పులివెందులలోని ఆదిత్య బిర్లా కంపెనీ వారు ఈ జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా అధికారులు మాట్లాడుతూ ఈ జాబ్ మేళా ప్రత్యేకించి మహిళల కోసమే ఏర్పాటు చేశారని దీనిని అర్హులైన మహిళలందరూ సద్వినియోగపరచుకోవాలన్నారు. ఆదిత్య బిర్లా కంపెనీ ఆధ్వర్యంలో టైలరింగ్‌కు సంబంధించిన జాబ్ మేళాను ఏర్పాటు చేశారన్నారు. ఈ జాబ్ మేళాలో నిరక్షరాస్యులతో పాటు ఐదవ తరగతి నుంచి డిగ్రీ చదివిన మహిళలు కూడా పాల్గొని వారి వారి అర్హతలను బట్టి ఉపాధిని పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో 185 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 150 మంది ఎంపికైయ్యారు. ఈ కార్యక్రమంలో అధికారులు మెప్మా అధికారి సీఎం ఎం హరి, ప్రసాద్, రామాంజనేయులు, నాగలక్ష్మి ఆదిత్య బిర్లా కంపెనీ ప్రతినిధులు జయకుమార్ ప్రభాకర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జనస్వరం కథనానికి స్పందన

**కదిలిన అధికారులు.. చెత్త తొలగింపు**






జనస్వరం
చెత్త కుండీ ఏర్పాటు చేశారు..
చెత్త తీయడం మరిచిపోయారు...!

**చింతపల్లి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** రామాలయం వీధిలోని అపరిశుభ్రతపై జనస్వరం పత్రికలో వచ్చిన వార్త కథనానికి స్పందనగా, గ్రామ పంచాయతీ చర్యలు తీసుకుంది. గిరిజన సంక్షేమ కేంద్ర కృత ఆశ్రమన్నత పాఠశాల, రామాలయం వీధి గ్రామాల మధ్యలో చెత్తకుండీ వద్ద పేరుకుపోయిన చెత్తను పంచాయతీ సిబ్బంది హుటాహుటిన తొలగించారు. ఈ నేపథ్యంలో పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ నేతృత్వంలో పారిశుద్ధ్య కార్మికులు సంఘటితంగా రంగంలోకి దిగారు. అధికంగా పేరుకుపోయిన చెత్తను తొలగించి, అక్కడ తిరుగుతున్న ప్రజలకు దుర్వాసన లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజల అభ్యర్థనపై సత్వర స్పందన చూపిన సర్పంచ్ పుష్పలత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చర్యలను స్థానికులు అభినందిస్తున్నారు.

## సింహాచలం ప్రమాదంలో మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి నాదెండ్ల పరామర్శ



**విశాఖపట్నం/యలమంచిలి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** సింహాచలంలో బుధవారం ప్రమాదవశాత్తు గోడ కూలిన ఘటనలో మృతుల కుటుంబ సభ్యులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరామర్శించారు. అనంతరం దుర్ఘటనపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్ కుమార్, పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా రైతుబజారు

**- వాణిజ్య సముదాయంలో తెరుచుకోని గదులు**

**- రూ.1.50 కోట్ల ప్రజాధనం వృధా**

**- వ్యాపారులకు కొరవడిన వసతులు**

**- స్టాల్స్ పెట్టుకునేందుకు ఆసక్తి చూపని వైనం**



**పులివెందుల, ఏప్రిల్ 30 (జనస్వరం) :** పులివెందుల మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన రైతుబజారు నిరుపయోగంగా మారింది. చిన్నకారు రైతులు పండించిన కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తే గిట్టుబాటు ధర ఉంటుందని భావించి గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డులో రూ.1.50 కోట్ల వ్యయంతో రైతు బజారు నిర్మాణం చేపట్టారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకువచ్చారు. కూరగాయల షెడ్లతో పాటు వాణిజ్య సముదాయం నిర్మించారు. ఈ రైతు బజారును 2024 జనవరి 17న అప్పటి సీఎం జగన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. గతంలో కేవలం నాలుగైదు రోజులు మాత్రమే ఇక్కడ కూరగాయల విక్రయాలు జరిగాయి. ఆ తరువాత ఒక్కరు కూడా ఈ రైతు బజారు వైపు కన్నెత్తి చూడకపోవడంతో నిరుపయోగంగా మారింది. కానీ మున్సిపల్ అధికారులు పట్టణంలోని రంగనాయకుల గుడి కాంప్లెక్స్లో మార్కెట్ నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని పెద్ద కూరగాయల అంగళ్లు మాత్రం పట్టణంలోని రంగనాయకుల స్వామి గుడి సమీపంలోని మార్కెట్లో వారపు సంత నిర్వహిస్తున్నారు. అలాగే బస్టాండు సర్కిల్లో చిరు వ్యాపారస్తులు ఇప్పటికీ విక్రయాలు నిర్వహిస్తున్నారు. పాత మార్కెట్లో మాత్రం అధికారులు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తొలగించలేదు. అదేవిధంగా పట్టణంలో ప్రధాన రహదారులలో రోడ్డు వైపు స్థలాలు ఆక్రమించుకుని కొందరు కూరగాయల వ్యాపారం చేసుకుంటున్న వారిని కూడా అధికారులు తొలగించలేదు. దీంతో ప్రస్తుతం వారపు సంత జరిగే ప్రాంతంలో వ్యాపారులు లేక ప్రజలు రాక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కూరగాయల విక్రయాలు పూర్తిగా వారపుసంత జరిగే ప్రదేశంలోకి తరలించడంతో పాటు లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రైతు బజారులో రైతులు కూరగాయల విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని చిరువ్యా పారులు, ప్రజలు కోరుతున్నారు. ఎలాంటి ప్రణాళికలు లేకుండా రైతు బజారు నిర్మించడంతో ఇక్కడికి మారేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. కాంట్రాక్టు తీసుకున్న వైసీపీ నాయకులు నిధుల విషయంలో చూపిన నిరుపయోగంగా ఉన్న రైతుబజారుపట్ల ఆసక్తి నిర్మాణంలో చూపడంలేదన్న విమర్శలున్నాయి. తూతూ మంత్రంగా నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయడంతో మార్కెట్ సముదాయంతో ఏర్పాటు చేసిన దుకాణాలు ఎందుకు పనికిరావన్నది అర్థమవుతోంది. దీంతో పట్టణంలోని పాత రంగనాధస్వామి మార్కెట్లో అంగళ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. కొత్తగా నిర్మించిన మార్కెట్ లోపలికి ఉన్నందున కొనుగోలుదారులు ఇక్కడికి వచ్చే అవకాశం లేదని వ్యాపారులు వాపోతున్నారు. వ్యాపారం లేకపోతే మా పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌కు వినియోగంలోకి తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు. ఈ విషయంపై మార్కెర్డు సెక్రటరీ శ్రీధర్రెడ్డి మాట్లాడుతూ రైతు బజారును పూర్తిగా వినియోగంలోకి తెచ్చి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

## పవన్ కళ్యాణ్ గారూ.. దేశభక్తి గురించి మీ దగ్గర పాఠాలు నేర్చుకోవలసిన దుస్థితిలో కాంగ్రెస్ లేదు

**- 8 రోజులైనా పహాల్గామ్ దాడికి కారకులైన ఒక్క ఉగ్రవాదిని కూడా ఎందుకు పట్టుకోలేదో మోడీని ప్రశ్నించండి.**

**- రాజ్యసభ మాజీ సభ్యులు తులసిరెడ్డి**



**పులివెందుల, ఏప్రిల్ 30 (జనస్వరం) :** "పాకిస్థాన్‌పై ప్రేమ వుంటే కాంగ్రెస్ నాయకులు పాకిస్థాన్ వెళ్లిపోవచ్చు" అని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదం, అవివేకమని రాజ్యసభ మాజీ సభ్యులు తులసి రెడ్డి అన్నారు. బీజేపీ పుట్టక ముందే, జనసేన పుట్టక ముందే, పవన్ కళ్యాణ్ పుట్టక ముందే 1948లోనే నెహ్రూ ప్రధాన మంత్రిగా కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌తో మొదటి సారి యుద్ధం చేసి గెలిచిందని ధ్వజమెత్తారు. వేంపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ 1965లోనే లాల్ బహదూర్ శాస్త్రి ప్రధానిగా కాంగ్రెస్ నేతృత్వంలో భారత ప్రభుత్వం పాకిస్థాన్‌తో రెండవ సారి యుద్ధం చేసి గెలిచిందన్నారు. 1971లో ఉక్కు మనిషి ఇందిరమ్మ ప్రధానిగా కాంగ్రెస్ నేతృత్వంలోని భారత ప్రభుత్వం మూడోసారి పాకిస్థాన్‌తో యుద్ధం చేసి గెలిచి, పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసిందన్నారు. దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వం కోసం ముగ్గురు కాంగ్రెస్ అగ్ర నాయకులు 1948లో మహాత్మా గాంధీ, 1984లో ఇందిరా గాంధీ, 1991లో రాజీవ్ గాంధీ ఆత్మ బలిదానం చేశారని తెలిపారు. అటువంటి కాంగ్రెస్ పార్టీ పవన్ కళ్యాణ్ వద్ద దేశ భక్తి పాఠాలు నేర్చుకోవల్సిన దుస్థితిలో లేదన్నారు. ఆంజనేయుని ముందు పిల్ల కోతి కుప్పి గంతులు వేసినట్లుందని దేశం తర్వాతే పార్టీలు, మతాలు అని, దేశం కోసం అంతా ఏకమై నిలవాలన్నారు. దేశం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను అందరూ సమర్థించాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే జైపూర్‌లో 28న బహిరంగ సభలో చెప్పారన్నారు. ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాలని, కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకున్నా మద్దతిస్తామని, భారతీయులందరూ ఏకం కావాలన్నారు. సమాజాన్ని విభజించడమే పహల్గం దాడి లక్ష్యమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ అన్నారని తెలిపారు. ఇవేమీ తెలుసుకోకుండా పవన్ కాంగ్రెస్‌పై అవాకులు చవాకులు పేలడం శోచనీయమన్నారు. పవన్‌కు నిజంగా దేశభక్తి ఉంటే ఏప్రిల్ 23న జరిగిన అఖిల పక్ష సమావేశానికి ఎందుకు రాలేదో ప్రధాని మోడీని ప్రశ్నించాలన్నారు. ఉగ్రవాద దాడి జరిగి 8 రోజులైనా ఒక్క ఉగ్రవాదిని కూడా ఎందుకు పట్టుకోలేదో మోడీని ప్రశ్నించాలంతే తప్ప కాంగ్రెస్‌పై అవాకులు, చవాకులు పేలవద్దని పవన్ కళ్యాణ్‌కు సూచించారు.

## నరసాపురం పార్లమెంట్ పరిశీలకునిగా ముదునూరి



**ప్రత్తిపాడు, ఏప్రిల్ 30 (జనస్వరం) :** వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ నరసాపురం పార్లమెంటు పరిశీలకులుగా స్థానిక నియోజకవర్గ వైసీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణరాజును నియమించడంతో నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఏ బాధ్యతలు అప్పజెప్పిన సమర్థవంతంగా పనిచేస్తానని మురళి కృష్ణంరాజు అన్నారు. ఈ సందర్భంగా మురళిరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌ని మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. నియోజకవర్గంలో వైసీపీ అభివృద్ధికి కృషి చేస్తున్న ముదునూరికి పార్టీ జగన్ రెడ్డి తగిన గౌరవం ఇచ్చారని వైసీపీని మరింత బలోపేతం చేయడానికి పని చేస్తామని ఆనందం వ్యక్తం చేశారు.

## మైహోమ్ ఖాతాలో మరొక అత్యున్నత పురస్కారం

**యలమంచిలి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** మండలంలోని ములకలాపల్లి గ్రామంలో ఉన్న మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ) మరో ఘనతను సాధించింది. ఫ్యాక్టరీలో "ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ" అంశంపై బ్రిటీష్ సేఫ్టీ కౌన్సిల్ ఏప్రిల్ 7 నుండి 9వ తేదీ వరకు నిర్వహించిన ఆడిట్‌లో మైహోమ్ ఫ్యాక్టరీకు 5-స్టార్ రేటింగ్ లభించిందని ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) బి. రామస్వామి వెల్లడించారు. ఇండియాలోని సిమెంట్ పరిశ్రమల మధ్య నిర్వహించిన ఈ సమీక్షలో బ్రిటీష్ సేఫ్టీ కౌన్సిల్ నుంచి ఇలాంటి అత్యున్నత పురస్కారం అందుకోవడం మైహోమ్ ఫ్యాక్టరీకి గర్వకారణమని ఆయన తెలిపారు. గతంలోనూ ఫ్యాక్టరీ పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నదని, భవిష్యత్తులో ఇంకా అధిక కృషితో మరిన్ని అవార్డులు సాధించేందుకు ప్రయత్నిస్తామని రామస్వామి పేర్కొన్నారు.

## క్రమశిక్షణ దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దాలి

**ఎన్సీసీ కల్నల్ అలోక్ త్రిపాఠి**





**నంద్యాల, ఏప్రిల్ 30 (జనస్వరం) :** చదువుకున్న సమయంలోనే విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించాలని కర్నూలు ఎన్సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠీ పేర్కొన్నారు. జూన్‌లో నిర్వహించబోయే అన్యువల్ ట్రైనింగ్ క్యాంపు సందర్శన సందర్భంగా శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కాలేజీలో ఎన్సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి సందర్శించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. కల్నల్ అలోక్ త్రిపాఠి ఎన్సీసీ క్యాడేట్స్‌తో ఇంటరాక్ట్ సంభాషిస్తూ ఎన్సీసీ క్యాడేట్స్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలన్నారు. ఎన్సీసీ శిక్షణలో ఎన్నో విషయాలు నేర్చుకుంటారని ముఖ్యంగా వ్యక్తిత్వ నిర్మాణంలో ప్రయోజనం పొందుతారని, మానసిక శారీరక దారుఢ్యాన్ని పొందుతారని, ఆత్మవిశ్వాసాన్ని అనుకూల మానసిక దృక్పథాన్ని ఏర్పరచుకుంటారని, దేశాన్ని సమాజాన్ని ఉన్నతమైన దృష్టితో చూసే గొప్ప నైపుణ్య లక్షణాలు ఏర్పడతాయన్నారు. జూన్ మాసంలో కర్నూలు 9వ బెటాలియన్ గర్ల్స్ విభాగం ఆధ్వర్యంలో జరగబోయే అన్యువల్ ట్రైనింగ్ శిక్షణ శిబిరానికి రెండు క్యాంపుల కోసం దాదాపు 20 రోజులు క్యాంపు నిర్వహణకు రామకృష్ణ కాలేజీ క్యాంపస్ హాస్టల్లు వసతి శిక్షణకు నిర్వహణకు అన్ని సదుపాయాలు కలిగిస్తున్న రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డిని అభినందించారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జూన్ మాసంలో నిర్వహించే ఎన్సీసీ క్యాంపుల కోసం తమ కళాశాలను హాస్టల్ వసతులను దాదాపు 20 రోజులు పాటు ఇస్తున్నామని వీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకొని తమ కళాశాల ఎన్సీసీ క్యాడేట్స్‌కు ఇతర కళాశాల స్కూలు నుండి వస్తున్న ఎన్సీసీ వారికి ఉపయోగపడాలని ఎలాంటి డ్యామేజ్ లేకుండా చూసుకోవాలని హితవు పలికారు. ఎన్సీసీ వలన ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నారని, అది తమ కళాశాలకు ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన కల్నల్ అలోక్ త్రిపాఠి, కల్నల్ జోబి ఫిలిప్స్ 9వ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సుప్రియలు, ఎన్సీసీ ఆఫీసర్లు డాక్టర్ లలితా సరస్వతి, కేర్ టేకర్ ఆఫీసర్ లక్ష్మీ దుర్గ, లెఫ్టినెంట్ కమల్ ఖాన్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## రంగురాళ్ల తవ్వకాలపై ప్రత్యేక నిఘా

**- దొడ్డికొండలో రంగురాళ్ల గోతులు కాంక్రీట్‌తో మూసివేత**

**- డివిజనల్ అటవీ శాఖ అధికారి నరసింహారావు**





**చింతపల్లి ఏప్రిల్ 30 (జనస్వరం) :** స్థానిక అటవీ రేంజ్ పరిధిలోని గూడెం కొత్త వీధి మండలం దొడ్డికొండ అటవీ ప్రాంతంలో రంగురాళ్ల కోసం అక్రమ తవ్వకాలు జరగకుండా అటవీశాఖ కఠిన చర్యలు చేపట్టింది. అటవీ శాఖ డిప్యూటీ సిఎఫ్ ఆదేశాల మేరకు అక్కడ ఉన్న రంగురాళ్ల గోతులను సిమెంట్ కాంక్రీట్‌తో మూసివేసినట్లు డివిజనల్ అటవీశాఖ అధికారి వై వి నరసింహారావు వెల్లడించారు. సిగినాపల్లి-దొడ్డికొండ అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యాపారులు అక్రమంగా చొరబడి రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడినట్లు గుర్తించిన అధికారులు, ఫారెస్ట్ రైట్స్ చట్టం ప్రకారం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంతేగాక, అటవీ కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేట వ్యవహారాలపై గట్టి నిఘా ఏర్పాటుచేసి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రంగురాళ్ళు తవ్వకాలు చేపడుతున్న అటవీ ప్రాంతం చుట్టుపక్కల గ్రామ ప్రజల్లో అటవీ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు డీఎఫ్ఓ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు అటవీ సంపదను కాపాడే దిశగా ముందడుగు వేయాలని అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమంలో కోరారు.

# కార్మిక కర్షకులకు మేడే శుభాకాంక్షలు

**- కార్మిక లోకం సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం**

**- కార్మిక సంఘాల నాయకులు, ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు వెల్లడి**



**ఏలూరు, ఏప్రిల్ 30 (జనస్వరం) :** రాష్ట్రంలోని కార్మికులు, కర్షకులు, శ్రామికులు తమ శ్రమను ధారపోస్తూ దేశ, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా పని చేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఉత్పత్తి, సేవారంగాలను బలోపేతం చేసే దిశగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానమన్నారు. తిరిగి కార్మికుల, పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. ఈ సందర్భంగా 139వ మేడే సందర్భంగా కార్మిక, శ్రామిక, కర్షక లోకానికి రెడ్డి అప్పల నాయుడు మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులు సంక్షేమంతో వర్ధిల్లినప్పుడే సమాజ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చి కార్మికులకి అండగా నిలబడిందన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపుతూ, రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు కుటుంబానికో పారిశ్రామికవేత్తగా ఉండాలన్న ఆశయంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు.. అలాగే సమాజంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన పీ4 విధానం పేదలు, కార్మికుల కుటుంబాలకు చేయూతగా నిలుస్తుందన్నారు. పరిశ్రమలే రాష్ట్ర ప్రగతికి మెట్లు, అయితే గత ఐదేళ్ల దుర్మార్గ పాలనలో రాష్ట్రం ప్రగతికి దూరమైందన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన పదినెలల్లోనే రాష్ట్రంలో పలు పరిశ్రమల స్థాపనతో పారిశ్రామిక రంగం కళకళలాడుతుందన్నారు. తిరిగి కార్మికుల, పేదల జీవితాల్లో వెలుగు కిరణాలు ప్రసరిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం కార్మిక లోకానికి అండగా ఉంటుందని, కార్మికులకు, కార్మికులకు 139వ మేడే శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.

## స్వచ్ఛందంగా జనసైనికులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

**- బాటసారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను**



**విజయవాడ, ఏప్రిల్ 30 (జనస్వరం) :** పటమట శ్రీ కోదండ రామాలయం ఆలయంలో నేడు జనసేన పార్టీ నాయకులు పెన్నూరు దామోదర్ రావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను హాజరయ్యారు. అనంతరం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలంలో ఎండ తీవ్రతగా ఉన్నందున జన సైనికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పటమట శ్రీ కోదండ రామాలయం ఆలయం ఆవరణంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని తెలిపారు. జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనసైనికులు అందరికీ అన్ని విధాలుగా తన అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ అమ్మిశెట్టి వాసు, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, కంట్రోల్ జోన్ ఆంధ్ర కన్వీనర్ బాడిత శంకర్, జనసేన పార్టీ నాయకులు డాక్టర్ కొండవీటి సంతోష్ కృష్ణ, గాదిరెడ్డి అమ్ములు, కొండవీటి ఈశ్వర్, స్థానిక జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## బీజేపీ దాడి చేస్తే కాంగ్రెస్ నేతల అరెస్ట్ సమంజసమా?

**వల్లూరు భార్గవ్**



**విజయవాడ, ఏప్రిల్ 30 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ బీజేపీ దాడిపై తీవ్రంగా స్పందించారు. స్థానిక కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సమయం లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గుడ్లు, రాళ్లు విసురుతూ కార్యాలయంలోకి దూసుకెళ్లడం దారుణమని ఆయన పేర్కొన్నారు. "కార్యాలయం చుట్టూ వందలాది మంది పోలీసులు ఉన్నా బీజేపీ కార్య కర్తలు లోపలికి ఎలా ప్రవేశించారు?" అని వల్లూరు భార్గవ్ ప్రశ్నించారు. ఇది కేవలం పోలీసుల నిర్లక్ష్యమేనా లేదా ప్రోద్బలంతో జరిగినదా అనే సందేహం ప్రజల్లో పెరిగిందని అన్నారు. ఘటనపై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలపై పోలీసులు అరెస్టులు చేయడం, వైఎస్ షర్మిల రెడ్డిని నివా సంలో నిర్బంధించడం ప్రజాస్వామ్యంపై మచ్చ వేసిన చర్యలుగా అభివర్ణించారు. బీజేపీ అధికార దుర్వినియోగంతో కాంగ్రెస్ పార్టీని అణిచివేయాలన్న ఆలోచనలో ఉందని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం కారణంగా భయపడుతున్నదని వల్లూరు భార్గవ్ విమర్శించారు. అమరా వతి శంకుస్థాపన సందర్భంగా నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, నిధులు ఇవ్వక పోయిన విషయాన్ని కూడ ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉన్నప్పటికీ కాం గ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి జరిగిన విషయంపై సీఎం చంద్రబాబు ఎలా స్పందిస్తారో ప్రజలు గమనిస్తున్నారని వల్లూరు భార్గవ్ అన్నారు.

## 'అమాస'కు టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ భువన్ కుమార్ రెడ్డి శుభాకాంక్షలు



**తిరుపతి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** చిత్తూరు జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన అమాస రాజశేఖర్ రెడ్డిని టీడీపీ నేత, తిరుపతి కోపరేటివ్ టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ పి.భువన్ కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు. బుధవారం రాజశేఖర్ రెడ్డి స్వగృహానికి వెళ్లి భువన్ కుమార్ రెడ్డి, ఆనంద్ బాబు యాదవ్, కూటమి నాయకులు అమాస రాజశేఖర్ రెడ్డిని శాలువాతో సత్కరించి డిసిసి బ్యాంక్ చైర్మన్ గా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భువన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో అమాస రాజశేఖర్ రెడ్డి మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.

## మైలవరంలో జనసేన క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ



**మైలవరం, ఏప్రిల్ 30 (జనస్వరం) :** మైలవరం నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించారు. అక్కల గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గ వాలంటీర్లకు 6544 క్రియశీల సభ్యత్వ కిట్లు అధికారికంగా పంపిణీ చేయబడినాయి. కార్యక్రమంలో మాట్లాడిన అక్కల గాంధీ, "త్వరలోనే నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సభ్యత్వ కిట్లు చేరేలా ఏర్పాట్లు జరుగుతాయ్" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైలవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ నవ్యశ్రీ, ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి లక్ష్మి, కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్, సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు నాని, రూరల్ మండలం అధ్యక్షులు రాజు, జి.కొండూరు మండలం అధ్యక్షులు నరసింహారావు, మైలవరం మండల అధ్యక్షులు బ్రహ్మయ్య, రెడ్డిగూడెం మండలం అధ్యక్షులు కాంతారావు, వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. సభ్యత్వం ద్వారా పార్టీ నిర్మాణం మరింత బలోపేతం అవుతుందని నాయకులు పేర్కొన్నారు.

## చింతలపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**విజయవాడ, ఏప్రిల్ 30 (జనస్వరం) :** సింహాచల అప్పన్న స్వామి చందనోత్సవం, అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా, చింతలపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో 47వ డివిజన్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. దీని ద్వారా పండగ వేళ ప్రజలకు నూతన ఆశా, హర్షం కలిగించారు. ఈ కార్యక్రమంలో 52వ డివిజన్ నుంచి ప్రముఖ నాయకులు నల్లబిల్లి కనక, గుండు జితేంద్ర, పల్నాటి ఆది, మల్లపరెడ్డి అప్పారావు, బంటుపల్లి రాంబాబు, చెవుల శ్రీనివాస్ బాబు, ప్రసాద్, సురేష్, ఫణి, శివ, సంగీత గర్ల్స్ తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించారు. ఈ కార్యక్రమం పాఠశాల, మండల కార్యాలయాలు, రోడ్డులు, పండగ సందడి మధ్య స్థానిక ప్రజలకు సమర్పించబడిన మజ్జిగను ప్రజలు ఆశీర్వదించారు.

## చవాకుల చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర్య నరేష్ బాబుకు 'ఇంటర్నేషనల్ బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ అవార్డ్'



**పాలకొల్లు, ఏప్రిల్ 30 (జనస్వరం) :** చవాకుల చారిటబుల్ ట్రస్ట్ అధినేత చవాకుల సూర్య నరేష్ బాబుకు మరో రెండు అరుదైన అవార్డులు దక్కాయి. విశాఖపట్నంలో ఉన్న పబ్లిక్ లైబ్రరీ హాలులో, ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ సోషల్ అవార్డ్స్ కార్యక్రమంలో, ఈ అవార్డులను నరేష్ బాబుకు అందజేశారు. చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి 'ఇంటర్నేషనల్ బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ అవార్డ్, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ఐకాన్ అవార్డులను నరేష్ బాబుకు ఇచ్చినట్లు ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

## గోపనపల్లిలో పెట్రోల్ బంక్ ప్రారంభం






**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** వాహన వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్ అందించడం కోసం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ గోపనపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ బంక్‌ను యజమానులు, స్థానిక కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి పీఏసీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ప్రజాసేవతో పాటు పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వ్యాపారాన్ని వృద్ధి చేయడం కోసం గంగాధర్ రెడ్డి చేస్తున్నా సేవలు అభినందనియమని తెలిపారు. ప్రజా సేవలో రాణించినట్లే వ్యాపారంలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీపీసీఎల్ హైదరాబాద్ చెర్లపల్లి, టెరిటరీ మేనేజర్ గురు రాజ్ సాంచ్, టెరిటరీ కో ఆర్డినేటర్, కార్తీక్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పల పాటి శ్రీకాంత్, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, పలువురు ప్రముఖులు, సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, బీజేపీ శ్రేణులు, భక్తులు, గోపనపల్లి గ్రామం వాసులు, మహిళలు, స్థానిక నేతలు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు




**బొంరాస్‌పేట/దుద్యాల, ఏప్రిల్ 30 (జనస్వరం) :** దుద్యాల మండలంలో బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చెట్టుపల్లి తండా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు 44 మంది పరీక్షలు రాయగా 44 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల విద్యార్థి పూజ 480 మార్కులతో టాపర్‌గా నిలిచింది. దుద్యాల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 51 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 44 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 86 శాతంగా నమోదు అయినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల విద్యార్థి దివ్య 535 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.

## పది ఫలితాల్లో మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు




**బొంరాస్‌పేట, ఏప్రిల్ 30 (జనస్వరం) :** పది ఫలితా ల్లో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ర్థులు సత్తా చాటారు. బొట్లవానితండా గిరిజన బాలి కల ఆశ్రమ పాఠశాలలో 52 మంది విద్యార్థులు పరీ క్షలు రాయగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో టాపర్‌గా లక్ష్మీ 538 మార్కులు సాధిం చింది. స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మొత్తం 147 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 132 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 88.80 శాతం నమోదు చేశారు. మొత్తం 8 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. పాఠ శాలలో ఇంగ్లిష్ మీడియం టాపర్ గుంజ భారవి అభ్యాస్ 524 మార్కులు సాధించగా, తెలుగు మీడియం టాపర్ మూడవత్ ఆర్తి 502 మార్కులతో టాపర్ గా నిలిచిందని మండల విద్యా ధికారి హరిలాల్, పాఠశాల ఉపాధ్యాయుడు బకారం మల్లయ్య తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ చౌదర్ప ల్లి పాఠశాలలో 55 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 50 మంది ఉత్తీర్ణత సాధించి 91 శాతం నమోదైంది. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కృషి పట్టుదలతో మెరుగైన ఫలితాలు సాధించారు.

## ప్రేమియర్ ఎక్స్ ప్లోజీవ్ కంపెనీ ప్రమాదం

**కార్మికుల భద్రతపై తీవ్రమైన ఆందోళన**



**యాదాద్రి భువనగిరి జిల్లా, ఏప్రిల్ 30 (జనస్వరం) :** కాటేపల్లి గ్రామంలో గల ప్రేమియర్ ఎక్స్ ప్లోజీవ్ కంపెనీలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో ముగ్గురు కార్మికులు మృతి చెందడం, నలుగురు కార్మికులు తీవ్ర గాయాలపాలవడం పట్ల ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, ఎమ్మెస్పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం పట్ల స్పందిస్తూ, ఆయన ప్రేమియర్ ఎక్స్ ప్లోజీవ్ కంపెనీ యాజమాన్య నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ ప్రమాదంలో కార్మికుల ప్రాణాలు కోల్పోవడం, గాయపడడం ఎంతో విచారకరమని పేర్కొన్న ఆయన, కంపెనీ యాజమాన్యం తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. నల్ల చంద్ర స్వామి వారి మాట్లాడుతూ, "ఈ సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జ్ చేత పూర్తి విచారణ జరిపి, ప్రమాదానికి గల కారణాలను వెలికితీయాలి. మృతుల కుటుంబాలకు రూ. 2 కోట్లు ఎక్స్ గ్రేషియా అందించాలి, క్షతగాత్రుల కుటుంబాలకు రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని మా డిమాండ్," అని అన్నారు. "ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే రోజు ముందు జరిగిన ఈ ప్రమాదం పేద కార్మికుల కుటుంబాల్లో విషాదం నింపింది. కార్మికుల భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి. కంపెనీని జన ఆవాసాల నుండి దూరంగా తరలించాలి," అని ఆయన వ్యాఖ్యానించారు.ప్రమాదం జరిగిన ప్రదేశం వద్ద మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని పరామర్శించి, వారికి పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సంఘటనపై ప్రజాస్వామ్య, కార్మిక హక్కుల రక్షణ కోసం ప్రజా సంఘాలు సంయుక్తంగా ఉద్యమించాలని, పేద కార్మికులకు కనీస హక్కులు అందేలా కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

## లోకకళ్యాణార్థం.. పరివార దేవతలకు పూజలు..




**శ్రీశైలం, ఏప్రిల్ 30 (జనస్వరం) :** శ్రీశైలక్షేత్రంలోని పరివార దేవతల కు విశేష పూజలు నిర్వహించామని కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస రావు పేర్కొన్నారు. ప్రతి బుధవారం ఉదయం ప్రధాన ఆలయానికి సమీ పంలోని సాక్షిగణపతి స్వామికి విశేషపూజలు నిర్వహించడం ఆన వాయితీగా వస్తోంది. గణపతి స్వామికి ఆలయ అర్చకులు విశేషపూజలతో పాటు పంచామృతాభిషేకం జరి పించారు. వైదిక సంప్రదాయంలో గణపతి స్వామికి నిర్వహించే అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. భక్తులు శ్రీశైలక్షేత్రాన్ని సందర్శించి శ్రీశైలభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించు కున్నట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్షం చెబుతాడాని పురాణాలు చెబుతు న్నాయి. అదే విధంగా ఆలయ ప్రాంగణంలోని జ్వాలవిరభద్రస్వామికి ప్రదోషకాలంలో విశేషపూజ లతో పాటు అభిషేకం నిర్వహించారు. ఈ స్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్ట రూపం లో దర్శన మిస్తాడు. ఈ స్వామికి అఘోరా వీరభద్రమూర్తి అని పేరుకుడా ఉంది. ఈ స్వామికి ఉభయ దేవాలయాలలోని పరివార ఆలయాలతో పాటు ప్రతినిత్యం పూజలు నిర్వహిస్తారు.

## ఏఎస్ఎన్ఎం స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ కళాశాలలో 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

**ఫలితాలు విడుదల చేసిన ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి**



**పాలకొల్లు, ఏప్రిల్ 30 (జనస్వరం) :** స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ కళాశాలలో 4వ, 6వ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాజరాజేశ్వరి మాట్లాడుతూ, ఏప్రిల్ రెండవ వారంలో 4వ సెమిస్టర్ పరీక్షలు, ఏప్రిల్ 28న 6వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించా మని తెలిపారు. 4వ సెమిస్టర్‌లో మొత్తం 154 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 134 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఉత్తీర్ణత శాతం 87.1 శాతంగా ఉందన్నారు. అలాగే, 6వ సెమిస్టర్‌లో హాజరైన విద్యార్థులంతా 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ టి.కృష్ణ, పరీక్షల కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్య తీసుకోవాలి

**పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షేక్ షారుఖ్**




**నెల్లూరు, ఏప్రిల్ 30 (జనస్వరం) :** జిల్లాలో ప్రభుత్వ నిబంధనల పాటించకుండా ఇష్టానుసారం గా వ్యవహరిస్తున్న ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని బుధవారం పీడీ ఎస్‌యూ జిల్లా కార్యదర్శి షేక్ షారుఖ్ ఆధ్వర్యంలో డీఈఓ ఆఫీసులో వినతిపత్రం సమర్పించారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షేక్ షారుక్ మాట్లాడుతూ ప్రభుత్వం సెలవుల ప్రకటిస్తే కొన్ని ప్రైవేట్ కార్పొరేటర్ స్కూల్స్ తరగతులు నిర్వహిస్తూ అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్నారని ప్రభుత్వ నియమ నిబంధనలు లేకుండా పుస్తకాలు, యూనిఫారం పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కొన్ని విద్యాసంస్థలు అయితే ప్రభుత్వ గుర్తింపు లేకుండా ఇంటర్నేష నల్ సీబీఎస్ఈ అని అనేక రకాల తోకల పేర్లు పెట్టుకొని అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. జీవీకే, బచ్పన్, కిడ్స్, ఇస్ పార్కు ఇలాంటి స్కూల్స్ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యవహ రిస్తున్నారని ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు షేక్ మస్తాన్, సభ్యులు హర్ష, పూజిత్తు, మస్తాన్, లోకేష్, చరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## యలమంచిలిలో టీడీపీ మండల, గ్రామ కమిటీల రద్దు

**యలమంచిలి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** టీడీపీ జాతీయ అధినాయకత్వం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పార్టీకి సంబంధించిన నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలన్నీ రద్దు చేసి నట్లు రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ప్రగడ నాగే శ్వరరావు తెలిపారు. నూతన కమిటీల నిర్మాణానికి మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతి రావు, సంస్థాగత ఎన్నికల పరిశీలకులు షరీఫ్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ జెడ్పీ చైర్మన్ లాలం భవానీ భాస్కర్, నియోజకవర్గ పరిశీలకులు బొండ జగన్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రీ సాయికృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్ కుమార్, దూళి రంగ నాయకులు తదితరులు సమీక్షించి కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు కొన్ని గ్రామాలలో స్వచ్ఛందంగా చేపట్టిన కమిటీ నిర్మాణాలను పార్టీ అధికారికంగా గుర్తించదని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గ్రామ, బూత్ స్థాయి కమిటీల నిర్మాణాన్ని మే 3 లోపు పూర్తి చేసి, వివరాలను నియోజకవర్గ టీడీపీ కార్యాలయానికి అందించాల్సిందిగా సూచించారు. అనంతరం సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు షరీఫ్ ఆధ్వర్యంలో మండల కమిటీల నిర్మాణ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. టీడీపీ వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామని కూడా ప్రగడ నాగేశ్వరరావు హెచ్చరించారు.

## కళారాధనలో.. నృత్యప్రదర్శన




**శ్రీశైలం, ఏప్రిల్ 30 (జనస్వరం) :** శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా బుధవా రం ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులకు విశేషంగా అలరించింది. శ్రీ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణ లో భాగంగా ఆలయ దక్షిణమాడవీధిలోని ధర్మపథం వేదికపై శ్రీబుచ్చేశ్వరరావు వారి బృందం ప్రకాశంజిల్లా వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ నృత్య ప్రదర్శన లో కళాకారులు పలు భక్తిగీతాలకు, అష్టకష్టాలకు నృత్యప్రదర్శన చేశారు. ఈ నిత్యకళారాధనలో ప్రతిరోజు హరికథ, బుర్రకథ, సాంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని కార్యక్రమా లు నిర్వహిస్తారు.

# క్రీడా శక్తిని సమాజాభివృద్ధికి వినియోగించడమే ప్రభుత్వ ధ్యేయం

- **మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**
- **మెగా డీఎస్సీలో 421 ప్రభుత్వ పాఠశాల ఉద్యోగాలు క్రీడాకోటా కిందకి భర్తీ**
- **రాత పరీక్ష లేకుండా సీనియర్ క్రీడా విభాగం మెరిట్ ఆధారంగా ఎంపిక**



**విజయవాడ, ఏప్రిల్ 30 (జనస్వరం) :** "క్రీడల ద్వారా యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారు. ఇది ఒక సమర్థ సమాజ నిర్మాణానికి మూలస్తంభం. ఈ విషయాన్ని ముం దుగానే గుర్తించి రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తు న్నాం" అని రవాణా యువజన క్రీడాశాఖ మంత్రి మంత్రి మం డపల్లి రాంప్రసాద్ ప్రసాద్ రెడ్డి అన్నారు. సీఎం ఎప్పటిలాగే యువత శక్తిని దేశాభివృద్ధికి మార్గనిర్దేశం చేస్తున్నారు. ఆయన పటిష్ట నాయకత్వం ఫలితంగా 'ఆంధ్రప్రదేశ్ క్రీడా పాలసీ 2024 -2029' రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ మాట్లాడుతూ "నారా లోకేష్ ఆధునిక దృష్టికోణం, యువతపై అభిమానం, క్రీడలపై ప్రోత్సాహంతో రాష్ట్రంలో క్రీడల రంగం శక్తివంతంగా ఎదుగుతోంది. స్పోర్ట్స్ డీఎస్సీ విధానంలో మైలు రాయిగా నిలిచిన ఈ చర్యలు, పదేళ్ల పరిమితి తొలగింపు వంటి కీలక నిర్ణయాలు లోకేష్ దూరదృష్టి ఫలితమే. క్రీడాకారుల ప్రతిభ కు న్యాయమైన గుర్తింపు ఇవ్వడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన క్రీడాకారుల కు ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం హారిజాంటల్ రిజర్వేషన్ కల్పి స్తూ, రాతపరీక్ష లేకుండానే ఉద్యోగావకాశాలు కల్పించనున్నది. ఈ అవకాశాలు యూనిఫార్మ్ సర్వీసులు సహా పలు ప్రభుత్వ శాఖ లలో లభించనున్నాయి. అంతేకాక, పాఠశాల విద్యాశాఖ 421 పోస్టులను క్రీడా కోటా కింద భర్తీ చేయనుంది. ఈ పోస్టులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, గిరిజన సంక్షేమ, రెసిడె న్షియల్, మోడల్ స్కూల్స్, గురుకులాల వంటి విద్యా సంస్థలలో ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు దరఖాస్తులు మే 2 నుంచి మే 31 వరకు http://sports.ap.gov.in, https://sportsdsc.apcfss.in వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటాయి. ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టు లకు అవసరమైన అర్హతలు లేని వారు, ఉద్యోగంలో చేరిన అనం తరం 5 సంవత్సరాల్లో ఆ అర్హతలు సాధించేందుకు వెసులుబాటు కల్పించడం ఈ పాలసీలోని ప్రత్యేకత. 33.33% మహిళా రిజర్వేషన్, లోకల్ – నాన్ లోకల్ విధానం అమలులో ఉంటాయి. ఎంపిక ప్రక్రియను సీనియర్ క్రీడా విభాగం ఆధారంగా మెరిట్ పద్ధతిలో, రాష్ట్ర స్థాయి కమిటీ తుది ఎంపికగా చేపడుతుంది. ఈ విధంగా, క్రీడలలో ప్రతిభ కనబర్చిన యువతకు స్థిరత, గౌరవం, ఉద్యోగ భద్రత లభించే అపూర్వ అవకాశంగా ఇది నిలవనుంది" అని అన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభు త్వం, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కి మంత్రి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## చింతపల్లి ప్రభుత్వ ఆర్ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస చారి**



**చింతపల్లి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** స్థానిక ప్రభుత్వ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (ఆర్ఐటిఐ)లో 2024-25 విద్యాసంవత్సరానికి చెందిన మొదటి విడత ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వా నిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి ప్రకటించారు. ఇన్స్టిట్యూట్‌లో ఎలక్ట్రీషియన్ (40 సీట్లు), మెకానిక్ మోటార్ వెహికల్ (24), ఫిట్టర్ (20), వెల్డర్ (40), ప్లంబర్ (24), వుడ్ వర్క్ టెక్నీషియన్ (24), స్టెనోగ్రాఫర్ (24) కోర్సుల్లో ప్రవేశాల కొరకు ఈ ప్రకటన జారీ చేశారు. అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా మే 24 లోగా దరఖాస్తు చేసు కోవాల్సిందిగా ఆయన తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను సమీప ప్రభుత్వ ఆర్ఐటిఐకి తీసుకెళ్లి మే 26లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలి. కౌన్సెలింగ్‌ను జూన్ మొద టి వారంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రవేశాలకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 9866108607, 9494377833 నెంబర్లకు సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

## లబ్ధిదారులకు నిర్ధిష్ట సమయంలో ధ్రువీకరణ పత్రాల అందజేతకు కృషి


**ఎంపీడీఓ శ్రీనివాసరావు**




**చింతపల్లి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** లబ్ధిదారులకు కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రా లను ఆలస్యం లేకుండా, నిర్ధిష్ట సమయానికి అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీడీఓ యూవీఎస్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. ఈ సమీక్ష సమావేశం అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, సామాజిక పింఛన్ పంపిణీ, కొత్త పింఛన్ దారుల గుర్తి ంపు, పలు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే జన్మించిన చిన్నా రులకు ఆధార్ నమోదు, ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్, పీఎం జేజేవై, పీఎంవీవై, పీఎం ఎస్‌బీవై, పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, మారుమూల గిరిజన గ్రామాలలో దోమలు వృద్ధి చెంది స్రాలు ప్రబలకుండా దోమల పిచికారీ (స్ప్రేయింగ్) వంటి కార్యక్రమాలను పూర్తి చేయడంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం లేకుండా ముందుండి పనిచేయాలని సూచించారు. మన మిత్ర కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగా హన కల్పిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. మన మిత్రలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవా ల్సిన బాధ్యత పంచాయతీ అధికారులపై ఉందని ఎంపీడీఓ హితవు పలికారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో పారదర్శకత, సమర్థత పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పునరు ద్ఘాటించారు. ఈ సమీక్ష సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఐఏఎస్ అకాడమీతో నంద్యాల కళాశాల ఒప్పందం

**జిల్లా వాసులకు సువర్ణవకాశం**



**నంద్యాల, ఏప్రిల్ 30 (జనస్వరం) :** జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు పట్టణంలోని ఐఏఎస్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో సెంటర్ ఏర్పాటు చేయుటకు అవగాహన ఒప్పందం కుదిరినట్లు శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి.రామ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై అవగా హన పెంపుదల ప్రొఫెషనల్ శిక్షణ, కెరియర్ మార్గదర్శకత్వం అందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు సివిల్స్ పరీక్షలు ఏపీపీఎస్సీ వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాలు సదస్సులు వర్క్ షాపులు వంటి సేవలు అం దించబడతాయన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఒప్పంద వలన ఈ ప్రాంత రైతుల భవిష్యత్తుకు మేలు చేసేందుకు పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో విద్యార్థుల్లో ముందుకు వెళ్లేందుకు ఇది ఒక మంచి అవకాశంగా నిలుస్తుందని పేర్కొ న్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా సివిల్ సర్వీసులోకి వచ్చేలా వారు నాణ్యమైన శిక్షణ అందించేందుకు కృషి చేస్తారని తెలిపారు. ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశాలు ఏమంటే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ప్రత్యేక బోధన వారానికి పరీక్షలు, ఫీడ్ బ్యాక్‌తో పాటు స్టడీ మెటీరియల్, కౌన్సిలి ంగ్ ఉంటుందని తెలిపారు. సుదూర ప్రాంతాలు హైదరాబాద్, బెంగళూరు చెన్నై వంటి ప్రదేశాలకు వెళ్లి శిక్షణ తీసుకోవటం అత్యంత వ్యయప్రయాసాలతో కూడుకుందని, దాన్ని తగ్గించుటకు ఈ కళా శాలలో ఐఏఎస్ అకాడమీ నిపుణులచే ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నా మని తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేబీవి సుబ్బయ్య, కంప్యూటర్ విభాగపు అధిపతి డాక్టర్ యూవీఎస్ కుమార్, కళాశాల డీన్ ఆఫ్ ది స్టూడెంట్ అఫైర్స్ ఏఎస్ ప్రగతి రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేటి నుండి కళారాధన ఉచిత శిక్షణా శిబిరం

**శిక్షకులతో ఏర్పాట్లపై సమీక్షా సమావేశం**



**నంద్యాల, ఏప్రిల్ 30 (జనస్వరం) :** కళారాధన సాంస్కృతిక సంస్థ, నంద్యాల ఆధ్వర్యంలో 23 సంవ త్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత లలిత కళలు, క్రీడల వేసవి శిక్షణ శిబిరం ఈ సంవత్సరం మే 1 నుండి మే 31 వరకు కళా సాధన -20 25 పేరిట నంద్యాల కేఎన్ఎం మున్సిపల్ స్కూల్ ఆవరణ లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ రవి కృష్ణ క్యాంపు కోఆర్డినేటర్ పత్తి రంగనాథ్‌లు శిక్షణ శిబిరంలో శిక్షణ ఇచ్చే కోచ్‌లతో ఏర్పాట్లపై బుధవారం కళారాధన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షకులు క్రమశిక్షణతో బాలలకు కళలలో సాధన చేయించాలని, వారిలో లలిత కళల పట్ల ఆసక్తిని పెంపొందించి వారిలో ఉన్న సృజనాత్మక శక్తుల్ని గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. శిక్షణ శిబిరంలో శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, వాద్య సంగీతంలో గిటార్, కీబోర్డ్, మిమిక్రీ, వెంట్రిలాక్విజం, చిత్రలేఖ నం, చక్కటి చేతిరాత, హస్తకళలు, సోప్ కార్వింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, పద్య పఠనం, సంస్కృత శ్లోకాలు, కవితా గానం, కవితా రచన, చదరంగం, కరాటే, టైక్వాండో, వ్యక్తిత్వ వికాసం వంటి అం శాలలో 22 మంది కోచ్‌లతో శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నారు. మే 31న ముగింపు ఉత్సవంలో 9959307424 శిక్షణ పొందిన బాలబాలికల ప్రదర్శనలు రూపొందించాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న ప్రతి వారికి ప్రశంసా పత్రం అందజేస్తామని, శిబిరంలో శిక్షణ పొందడానికి, ముగింపు ఉత్సవంలో ప్రదర్శనలు ఇవ్వడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, అవసరమైన అన్ని ఏర్పాట్లు కళారాధన చేస్తుందని, ఈ రకంగా పూర్తి ఉచితంగా, ఇన్ని అంశాలలో, ఇంతమంది శిక్షకులతో 25 సంవత్సరాలలో కోవిడ్ సమయంలో రెండు సంవత్సరాలు మినహాయి ంచి 23 సంవత్సరాలు క్రమం తప్పకుండా నిర్వహించిన సంస్థ భారత దేశంలో కళారాధన మాత్ర మేనన్నారు. వేసవి సెలవులను బాలలు, యువత సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కళ లు, క్రీడలు బాలల మానసిక, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని తద్వారా చదువులో కూడా రాణించడానికి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ సమీక్షా సమావేశంలో కళారాధన యువజన విభాగం అధ్యక్షుడు, శిబిరం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రంగనాథ్, కోచ్‌లు గణేష్, కళ్యాణి, లలితా సర స్వతి, సుభాషిని, ప్రజ్వల, మానస,రజాక్, సుదర్శనం, బాలకృష్ణ, నాగేంద్ర, రాజేంద్ర, బాల స్వామి, శివకుమార్, సతీష్, మధు, రాజా, తరుణ్, సీతారాం, రాజ్ కుమార్, సత్యనారాయణ, రామసుబ్బ య్య, వెంకట రాజు, ఫణి సాయి, దామోదర్, సమీర్, శబరి, నిలయ్ రాజ్ పాల్గొన్నారు.

## అగ్ని బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేత



**విఆర్ పురం, ఏప్రిల్ 30 (జనస్వరం) :** మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తోడం రాంబాబు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సర్వసంపత్తి కోల్పోయిన బాధిత కుటుంబానికి "కృష్ణార్జున ఫౌండేషన్" అధ్యక్షుడు కాకునూరు కృష్ణార్జునరావు బియ్యం, దుప్పట్లు, కూరగాయలు తదితర నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విచ్చేసిన ఉప సర్పంచ్ తోడం బూబమ్మ మాట్లాడుతూ, "మారుమూల ప్రాంతమైన మా చొక్కనపల్లి గ్రామానికి వచ్చి అగ్ని బాధిత కుటుంబానికి సహాయహస్తం చేర్చడం గొప్ప విషయం. మా గ్రామం తరపున కాకునూరు కృష్ణార్జునరావుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద రాజు, పులి ధర్మరాజు, వార్డు మెంబర్ గొంది ధారయ్య, తోడం మంగమ్మ, తోడం సీతారామరాజు, నోముల శ్రీనివాసరావు, బాగుల శ్రీనివాసరావు, గొల్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## హరివిల్లు ఆధ్వర్యంలో మేజిక్ స్టార్ బోస్‌కు సన్మానం




**విజయవాడ, ఏప్రిల్ 30 (జనస్వరం) :** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర సాంస్కృతిక మండలి సంయుక్తంగా స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం లో భీమవరం పట్టణా నికి చెందిన ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచ యిత మేజిక్ స్టార్ డా. బోస్‌కు 'కళా రత్న' పురస్కారం అందించిన సందర్భంగా పాలకొల్లు పట్ట ణానికి హరివిల్లు సాంస్కృ తిక సంస్థ ఆధ్వర్యంలో మ్యాజిక్ స్టార్ బోస్‌ను ఘనంగా సన్మానించారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ కాంప్లెక్సులో నిర్వహించిన అభినందన సభలో హరివిల్లు వ్యవస్థాపక అధ్యక్షుడు వంగా నరసింహా రావు అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకట రత్నం స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎస్‌పీఎన్ వర్మ పాల్గొన్నారు. డాక్టర్ బోస్ ఇంద్రజాల రంగానికీ, ప్రజలలో ఉన్న మూఢనమ్మకాలను తొలగించడానికీ మేజిక్ రచనల ద్వారా ప్రజలను చైతన్యపరచి మంచి సమాజం కోసం ఎనలేని కృషి చేశారని, మేజిక్ కళను సామాన్యుడికి అందు బాటులోకి వచ్చేలా మేజిక్ పత్రికలను నడిపి ఎందరో శిష్యులను తయారుచేసి, వారికి మార్గదర్శ కుడుగా నిలిచారని, అందుకే ఆయనకు ప్రభుత్వ, ప్రభుత్వేతర పురస్కారాలు, జాతీయ, అంతర్జా తీయ స్థాయిలో బిరుదులు, సన్మానాలు పొందారని, ఆ కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం 'కళా రత్న' పురస్కారంతో ఆయనను సత్కరించిందనీ వక్తలు కొనియాడారు. అనంతరం మెజీషియన్లు మధు, జానకి రామ రాజు, శుభాకర్, పి.శ్రీనివాస్ తమ తమ మేజిక్ ప్రదర్శనలతో ప్రేక్షకులను రంజింపజేశారు.

## నీచ సంస్కృతి, నీచ భాష టీడీపీలో లేదు..

# అదంతా వైసీపీ విష సంస్కృతి

- విశాఖ దక్షిణంపై "తెలుగు శక్తి" దండయాత్ర
- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ని డామినేట్ చేసేందుకు సీతంరాజు యత్నం
- కనీసం దరఖాస్తులను కూడా ఎమ్మెల్యేకు చేరనీయడం లేదు
- తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆరోపణ



**విశాఖపట్నం, ఏప్రిల్ 30 (జనస్వరం) :** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అనుచరులు తనను వైసీపీ కోవర్టుగా ఆరోపించడాన్ని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ జీర్ణించుకోలేకపోతున్న సంగతి తెలిసిందే. ఆ సంగతి అలా ఉంచితే.. తాజాగా బి.వి.రామ్ విశాఖ దక్షిణ నియోజకవర్గంపై "దండయాత్ర" ప్రారంభించారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ని డామినేట్ చేసే విధంగా ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. ఎమ్మెల్యే వంశీ జనసేనకు చెందిన వారని, ఆయనకు ప్రాధాన్యత ఇవ్వనవసరం లేదని పార్టీ కార్యకర్తలకు నూరిపోస్తున్నారని బి.వి.రామ్ వ్యాఖ్యానించారు. కనీసం దరఖాస్తులు కూడా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ వద్దకు వెళ్లకుండా అడ్డుకొని సీతంరాజు సుధాకర్ తన వద్దకు రప్పించుకుంటున్నారన్నారు. ఈ విషయంపై ఇటు టీడీపీ అటు జనసేన పార్టీలకు చెందిన అగ్రనేతలు సారించాలని కోరుతున్నారు. ఎన్నికలకు ముందు రెండు నెలల ముందుగా వైసీపీ నుంచి వచ్చిన సీతమ్మరాజు సుధాకర్‌కు టీడీపీలో ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీలో ఉన్నప్పుడు చంద్రబాబును హీనాతిహీనంగా దూషించిన సీతమ్మరాజుకు ప్రాధాన్యత ఇవ్వడం తగదన్నారు. టీడీపీలో నాయకులు ఎవరూ లేనట్టు సీతంరాజుకు వైద్య సేవ.. అది కూడా ఎన్టీఆర్ పేరుతో ఉన్న ఎన్టీఆర్ వైద్య సేవకు చైర్మన్ పదవిని కేటాయించడంతో.. టీడీపీలో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. అంటే చంద్రబాబుని తిట్టిన వారికే పదవులు ఇస్తారా ? అని బి.వి.రామ్ ప్రశ్నించారు.

**అదంతా వైసీపీ విష సంస్కృతి :**
తనను వైసీపీ కోవర్టుగా చిత్రీకరించాలని చూస్తున్న పల్లా శ్రీనివాసరావు అనుచరులు తమపై తీవ్రమైన పదజాలాన్ని ప్రయోగిస్తున్నారని బి.వి.రామ్ తెలిపారు. తాను విమర్శించినా ఎంతో హుందాగా విమర్శిస్తానని, ఏనాడు కూడా స్థాయి దిగజారి మాట్లాడలేదని పేర్కొన్నారు. పల్లా అనుచరుడు టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు మాత్రం అతి నీచమైన భాషను ఉపయోగిస్తూ వీడియోలను విడుదల చేస్తున్నారన్నారు. తాజాగా విడుదల చేసిన వీడియోలో "ఒరేయ్ రామ్.. నువ్వు ఒక లుచ్చా" అంటూ తీవ్రమైన పదజాలాన్ని ప్రయోగించారన్నారు. ఇలాంటి నీచ సంస్కృతి, నీచ భాష టీడీపీలో లేదని, ఈ దుష్ట సంస్కృతి వైసీపీలో మాత్రమే ఉందన్నారు. ఈ పరిస్థితులను బట్టి చూస్తే వైసీపీ కోవర్టులు పల్లా శ్రీనివాస రావు అతని అనుచరులు అని స్పష్టంగా బహిర్గతమవుతుందన్నారు. ఇటువంటి వ్యక్తులను పార్టీకి దూరంగా ఉంచాలని.. ముఖ్యంగా ప్రసాదుల శ్రీనివాసరావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. మాజీ సీఎం జగన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్ కుమార్ పై ఎటువంటి చర్యలు తీసుకున్నారో ప్రసాదుల శ్రీనివాస్‌పై కూడా అలాంటి చర్యలే తీసుకోవాలని బి.వి.రామ్ డిమాండ్ చేశారు.

**ఒంటరిగానే చర్చకు వస్తా.. :**
పల్లా శ్రీనివాసరావు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మధ్య కొనసాగుతున్న అంతర్యుద్ధం నేపథ్యంలో ప్రసాద్ శ్రీనివాసరావు విడుదల చేసిన వీడియోలో చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారన్నారు. వాస్తవానికి ఎవరు కోవర్టులో తేల్చుకునేందుకు తానే చర్చకు ముందుగా పిలుపునిచ్చానని రామ్ తెలిపారు. ఈ పరిస్థితులలో శుక్రవారం నుంచి విశాఖలో అందుబాటులో ఉంటానని, తేదీ, సమయం చెబితే తాను ఒంటరిగానే వస్తానని బి.వి.రామ్ తెలిపారు.

**నాపై ఎమ్మెల్యేగా పల్లా పోటీ చేసి గెలవగలరా? :**
కార్పొరేటర్‌గా కూడా గెలవలేనని చెపుతున్న ప్రసాదులకు తాను చెపుతున్న సమాధానం ఒక్కటేనన్నారు. గాజువాక నుంచి ఎమ్మెల్యే స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని తెలిపారు. మరి ఎమ్మెల్యే పదవికి పల్లా రాజీనామా చేసేందుకు సిద్ధమా? అని సవాల్ చేశారు. తాను నామినేషన్ దాఖలు చేసి అమెరికా వెళ్లిపోతానని, ఆ పరిస్థితిలో ఎమ్మెల్యేగా పల్లా గెలిచి చూపించాలని సవాల్ చేశారు.

## బాబు, పవన్ నేతృత్వంలో అమరావతి అజరామర అభివృద్ధి


- దేశం మొత్తం చూసేలా అమరావతి పునః ప్రారంభ వేడుకలు
- ప్రతి ఆంధ్రుడు గర్వపడేలా మోదీ పర్యటన
- నాటి విధ్వంసం నుంచి రేపటి వికాసం దిశగా రాజధాని
- అమరావతి రైతుల త్యాగం అనన్యం
- హలో ఏపీ - ఛలో అమరావతి పోస్టర్లు విడుదల చేసిన జనసేన శ్రేణులు
- ప్రజలకు మోదీ సభ ఆహ్వాన ప్రతుల అందచేత



**గుంటూరు, ఏప్రిల్ 30 (జనస్వరం) :** ఐదేళ్ళ వైసీపీ నిరంకుశ పాలనలో నిర్లక్ష్యానికి గురైన రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో అజరామర అభివృద్ధి దిశగా అడుగులేస్తుందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. మే 2 శుక్రవారం నాడు ప్రధాని మోదీ అమరావతి రానున్న నేపథ్యంలో హలో ఏపీ – ఛలో అమరావతి పోస్టర్లను అయన కూటమి నేతలతో కలిసి బుధవారం శ్రీనివాసరావుతోటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోదీ సభకు సంభందించి ఆహ్వాన ప్రతులను ప్రజలకు అందించారు. ఆళ్ళ హరి మాట్లాడుతూ అమరావతి రాజధానిపై వైసీపీ చేసిన విషపూరిత కుట్రలను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు. రాష్ట్రం కోసం తమ పచ్చటి పంట పొలాలను త్యాగం చేసిన రైతులకు వైసీపీ ప్రభుత్వం క్షణక్షణం నరకం చూపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతిని ప్రతీ ఆంధ్రుడు గర్వపడేలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ వివిధ స్థాయిల్లో సుమారు లక్ష కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్రానికి రావటం శుభపరిణామన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవానికి, ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలికేందుకు ప్రజలు అమరావతి తరలిరావాలని ఆళ్ళ హరి ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు షేక్ మెహబుబ్ బాషా, కోలా అంజి, వడ్డే సుబ్బారావు, నండూరి స్వామి, పసుపులేటి నరసింహారావు, ఇల్లా శేషు, పట్టంశెట్టి చిట్టీ, పోతురాజు, స్టూడియో బాలాజీ, జక్కా రాఘవులు, పడిసిపోగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో అధికంగా ఎండల తీవ్రత

**చెప్పులు, నీటి కుండల పంపిణీ**






**విజయవాడ, ఏప్రిల్ 30 (జనస్వరం) :** నగరంలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో, జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు తిరుపతి అనూష మానవీయ కార్యం చేపట్టారు. కనకదుర్గ అమ్మవారి కొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో పాదచారులు, భక్తులకు చెప్పులు, అలాగే నీటి కుండలను పంపిణీ చేశారు. వేసవి వేడిని తట్టుకునేందుకు సాయపడే విధంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించడాన్ని ప్రజలు హర్షించారు. తిరుపతి అనూష మాట్లాడుతూ, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మరింత మంది ప్రజలకు సహాయం చేసే కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

## కుటుంబ సమేతంగా అప్పన్న సన్నిధిలో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

**నిజరూప దర్శనం చేసుకున్న తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**



**విశాఖపట్నం, ఏప్రిల్ 30 (జనస్వరం) :** బుధవారం సింహాచలంలో చందనోత్సవం సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ సింహాద్రి అప్పన్న స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకు న్నారు. స్వామివారి దర్శించుకున్న అనంతరం బి.వి.రామ్ మాట్లాడుతూ స్వామి చల్లని కరుణ కృప ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. స్వామి వారి దర్శన భాగ్యం కలగడం ఎన్నో జన్మల పుణ్యఫలం అని అన్నారు.

## 2వ ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో బి.శిరీషకు గోల్డ్ మెడల్ అభినందించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ, ఏప్రిల్ 30 (జనస్వరం) :** న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏప్రిల్ 25 నుంచి 27 వరకు నిర్వహించిన 2వ ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన బి.శిరీషను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. సీనియర్– ఏ విభాగంలో ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో బంగారు పతాకాన్ని సాధించిన శిరీష గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ యోగాలో బంగారు పతకం సాధించిన శిరీషను అభినందించటమే కాకుండా శాలువాతో సత్కరించారు. అలాగే శిరీష ఆంధ్రప్రదేశ్ తరుపున పోటీ చేసి ఇండియా యోగాసన టీమ్‌కి వైస్ కెప్టెన్‌గా ఎన్నికైనందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో ఇండియా తరుపున పోటీ పడి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## కార్మిక లోకం సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం

**మేడే శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**





**విజయవాడ, ఏప్రిల్ 30 (జనస్వరం) :** రాష్ట్రంలోని కార్మికులు, కర్షకులు, శ్రామికులు తమ శ్రమను ధార పోస్తూ దేశ, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా పని చేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. ఉత్పత్తి, సేవారంగాలను బలోపేతం చేసే దిశగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం. తిరిగి కార్మికుల, పేదల జీవితాల్లో వెలుగు నింపుతుంది. మేడే సందర్భంగా కార్మిక, శ్రామిక,కర్షక లోకానికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మేడే శుభాకాంక్షలు తెలిపారు. "కార్మికులు సంక్షేమంతో వర్ధిల్లినప్పుడే సమాజ ప్రగతి సాధ్యం. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుంది. ఉచిత ఇసుకవిధానాన్ని అమల్లోకి తీసుకువచ్చి కార్మికులకి అండగా నిలబడింది. వారి జీవితాల్లో వెలుగులు నింపింది. అలాగే రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు కుటుంబానికో పారిశ్రామికవేత్తగా ఉండాలన్న ఆశయంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. అలాగే సమాజంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చేపట్టిన పీ4 విధానం పేదలు, కార్మికుల కుటుంబాలకు చేయూతగా మారింది. పరిశ్రమలే రాష్ట్ర ప్రగతికి మెట్లు .. అయితే గత ఐదేళ్ల దుర్మార్గ పాలనలో రాష్ట్రం ప్రగతికి దూరమైంది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన పదినెలల్లో రాష్ట్రంలో పలు పరిశ్రమల స్థాపనతో పారిశ్రామిక రంగం కళకళలాడుతూ.. తిరిగి కార్మికుల, పేదల జీవితాల్లో వెలుగు కిరణాలు ప్రసరిస్తున్నాయి. టీడీపీ కార్మిక లోకానికి అండగా వుంటుంది". అని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

## ప్రకృతి విపత్తు బాధితులపై శవ రాజకీయాలా?

**మంగళగిరి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** సింహాద్రి అప్పన్నస్వామి చందనోత్సవంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో ప్రభుత్వ స్పందనపై ప్రశంసలు లభిస్తున్నప్పటికీ, విపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధిని ప్రశ్నిస్తూ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. స్వామి వారి నిజరూప దర్శనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులు వర్షం కారణంగా గోడ కూలిన ఘటనలో ప్రాణనష్టానికి గురయ్యారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించడమే కాక, క్యూలైన్లను క్రమబద్ధీకరించి సహాయక చర్యలు చేపట్టింది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం, గాయపడినవారికి రూ.3 లక్షల పరిహారం ప్రకటించడంతో పాటు, కుటుంబ సభ్యులకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, సహాయ చర్యలపై కన్నెత్తి చూడకుండా, తన స్వార్థ రాజకీయాల కోసం జగన్ రెడ్డి శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. బెంగళూరు నుంచి వచ్చిన ప్రతీసారి రాష్ట్రంలో అలజడి సృష్టించాలనే కుట్రతో వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తిరుపతి రుయా ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరత కారణంగా 112 మంది మృతి చెందినప్పుడు, జంగారెడ్డిగూడెం కల్తీ మద్యం ఘటనలో 27 మంది మృతి చెందినప్పుడు, విశాఖపట్నం హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో క్రేన్ కూలి 11 మంది మృతి చెందినప్పుడు, అన్నమయ్య ప్రాజెక్టు ప్రమాదంలో, కచ్చులూరు బోటు ప్రమాదంలో, విశాఖ ఎల్జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజ్ విషాదంలో, విజయవాడ వరద బాధితుల విషయంలో జగన్ స్పందించలేదని, బాధితులకు కనీస పరామర్శ చేయలేదని కఠినంగా విమర్శించారు. ఆ సందర్భాల్లో కనీసం బాధితులను ఆదుకోవడానికి కదలని జగన్ ఇప్పుడు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాడని ఆరోపించారు. జగన్ రాజకీయ నైతికతపై ప్రజలు ఇప్పటికే విసుగెత్తిపోయారని, ఇకనైనా మానవీయ దృష్టితో ఆలోచిస్తే తప్ప రాజకీయ భవిష్యత్తు ఉండదని అచ్చంనాయుడు హెచ్చరించారు.

## బోలియశెట్టి రామారావుకి ఘన సన్మానం



**విశాఖపట్నం, ఏప్రిల్ 30 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో 42 సంవత్సరాల పాటు అంకితభావంతో క్యాషియర్‌గా సేవలందించిన బోలియశెట్టి రామారావు బుధవారం పదవీ విరమణ పొందారు. వేపాడ బ్రాంచ్‌లో చివరి వరకు రిమార్కులే లేకుండా, నిష్ఠ, నిజాయితీ, సమర్థతతో తన విధులను నిర్వర్తించారు. సహోద్యోగులందరి మన్ననలు, ఖాతాదారుల అభిమానం పొందడమే కాకుండా, బ్యాంకు అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. రామారావు విశేషమైన సేవల పురస్కరంగా, వేపాడ బ్రాంచ్‌లోని సిబ్బంది, మేనేజ్మెంట్ సభ్యులు వారి సానుకూల దోహదాన్ని గుర్తు చేసుకుంటూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, బ్యాంక్ ఖాతాదారులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ, "రామారావు సేవలు మా సంస్థకు మినీ ఆదర్శంగా నిలిచాయి. వారి అంకితభావం ప్రతి ఉద్యోగికి స్ఫూర్తిదాయకం" అని అన్నారు. బోలియశెట్టి రామారావు స్పందిస్తూ, "ఈ 42 సంవత్సరాలు నాకు గౌరవంగా అనిపిస్తున్నాయి. బ్యాంక్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు" అని అన్నారు. ఈ సందర్భంగా, రామారావుకి బ్యాంక్ తరఫున జ్ఞాపికలు అందజేయడమేకాక, వారి భవిష్య జీవితం ఆనందమయంగా సాగాలని కోరుతూ అందరూ శుభాకాంక్షలు తెలిపారు.


## చందనోత్సవంలో జరిగిన అపశృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- మృతుల కుటుంబాలకు పూర్తి న్యాయం చేయాలి
- కర్రా జయసరిత



**పాలకొల్లు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామి దేవస్థానంలో, నిర్వహించిన చందనోత్సవంలో జరిగిన అపశృతికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, గోడ కూలి, మరణించిన మృతులకు న్యాయం చేయాలని వైసీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కర్రా జయ సరిత అన్నారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సింహాచలం పుణ్యక్షేత్రంలో జరిగే చందనోత్సవానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ ఉత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని చెప్పారు. అంత ప్రతిష్ట కలిగిన చందనోత్సవానికి హాజరయ్యే భక్తులకు అవసరమైన సౌకర్యాలను, భద్రతను కల్పించడంలో అధికారులు ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమయ్యారని విమర్శించారు. వైసీపీ తరపున ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నామన్నారు. గోడ నిర్మాణంలో జరిగిన అవకతవకలు, కూలిపోవడానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. నోరు విప్పితే సనాతన ధర్మం.. సనాతన ధర్మం అని మాట్లాడే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ విషయంపై పెదవి విప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సనాతన ధర్మం అంటే ఇదేనా అని పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. వెంటనే ఈ ఘటనకు కారకులైన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ జయ సరిత చేశారు

## జనవాణి కార్యక్రమంలో ప్రజల సమస్యల పరిష్కారానికి స్పందన



**మంగళగిరి, ఏప్రిల్ 30 (జనస్వరం) :** జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతల రామకృష్ణ, జనసేన పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు తిరుపతి అనూష పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వీటిని స్వీకరించిన అనంతరం, తిరుపతి అనూష వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సంప్రదింపులు జరిపారు. ప్రజల అభ్యర్థనలకు స్పందించి వేగంగా పరిష్కారం అందించేందుకు జనసేన పార్టీ కట్టుబడి ఉందని నేతలు తెలిపారు.